www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 6 ఫిబ్రవరి 2025

5

తూర్పుగోదావరి



ఎపిజిఇఎ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్‌ను కలెక్టర్ మెజిస్ట్రేట్ పి.ప్రశాంతి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఇదే సందర్భంలో వివిధ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగులను కలిసి క్యాలెండర్ వారికి ఇచ్చి సంఘం యొక్క విశిష్టత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.గిరి ప్రసాద్ వర్మ, జిల్లా అధ్యక్షుడు సిహెచ్.ఎస్.విల్సన్‌పాల్, జిల్లా కార్యదర్శి, కాళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి దినేష్, రాజమహేంద్రవరం నగర శాఖ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్న, హమీద్, మహ్మద్ ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సా..గుతున్న రబీ

- సాగు విస్తీర్ణం1.99 లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకూ నాట్లు 1.60 లక్షల ఎకరాలు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రబీ పంటల సాగు పనులు దాదాపు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా ఇప్పటికీ 81 శాతానికే పరిమితమైంది. ఈ ఏడాది రబీలో అని రకాల పంటలూ కలిపి 1.99 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఏటా రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తుతున్న నేపథ్యంలో ముందస్తు సాగు చేయాలని అధికార యంత్రాంగం భావించింది. డిసెంబరులో తుపాను నేపథ్యంలో ప్రణాళికలు పూర్తిగా తలకిందులయ్యాయి. దీంతో రాబోయే రబీలోనూ కష్టాలు తప్పవనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతన్నలు అనేక సందేహాల నడుమ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ దాటినా జిల్లాలో రబీ సాగు 87 శాతానికి కూడా చేరుకోలేదని స్పష్టమవుతోంది. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.50 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,30,000 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. జొన్న పంట 825 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా కేవలం 370 ఎకరాల్లో ప్రారంభమైంది.మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 24,452 ఎకరాలు కాగా కేవలం 15,077 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. ఇక అపరాల విషయానికి వస్తే పెసలు 2,325 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,022 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. పెసలు 1,447 ఎకరాల్లో ప్రారంభించాల్సి ఉండగా 145 ఎకరాల్లో మాత్రమే సాగు ప్రారంభమైంది. అంటే కేవలం 10 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. మినుములు 2,335 ఎకరాలకు గాను ఇప్పటివరకు 705 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. నూనె పంటలైన వేరుసెనగ 632 ఎకరాలకు గాను 337 ఎకరాల్లోనే సాగు మొదలయ్యింది. నువ్వులు 725 ఎకరాలకు గాను 1,55 ఎకరాల్లో సాగు ప్రారంభమయ్యింది. పొద్దు తిరుగుడు పంట 545 ఎకరాలకుగాను కేవలం 70 ఎకరాల్లో సాగు ప్రారంభమయ్యింది. వాణిజ్య పంటల సాగులో ప్రధానంగా చెరకు 1,837 ఎకరాలకు గాను కేవలం 140 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. కేవలం 8 శాతమే నమోదయ్యింది. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో ఏటా చెరుకు సాగు క్రమంగా తగ్గిపోతోంది. పొగాకు 14,490 ఎకరాలకు గాను 12,395 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటికే జిల్లాలో వరి నాట్లు కూడా పూర్తి స్థాయిలో పడలేదు. సకాలంలో కాల్వలకు నీరు విడుదల చేసినా అవి శివారు భూములకు చేరే సరికి ఆలస్యం కావడంతో సాగులో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. ముందుగానే డిసెంబరు 31 నాటికి వరి నారు వేసి నాట్లు ప్రారంభిస్తే సాగునీటి కొరత అధిగమించవచ్చని తొలుత అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం నెల రోజులు ఆలస్యం కావడంతో నీరు జలాలపై ఆధారపడాల్సిన తప్పని పరిస్థితి. సీలేరులో అదనంగా నీరు లభించని పక్షంలో తుది దశలో సాగునీటి కొరత ఏర్పడుతుందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు, కార్మికులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పార్లమెంట్‌లో బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక శ్యామల సెంటర్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టి.అరుణ్, ఎఐటియుసి నాయకులు టి.మధు, ఐఎఫ్‌టియు నాయకులు డి.శ్రీనివాసరావు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినా కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని కార్మికుల హక్కులను కాల రాయడం తప్ప మరొకటి కాదన్నారు. స్వాతంత్ర్య పూర్వం నుంచి పోరాడి సాధించుకున్న కార్మికుల కనీస హక్కులను కాలరాస్తూ కార్మికుల్ని కట్టు బానిసలుగా కార్పొరేట్లకు అందలం ఎక్కించేందుకు కార్మికులను పని దోపిడీకి మరింత తీవ్రతరం చేసేందుకు ఈ లేబర్ కోడ్స్ తీసుకొచ్చారన్నారు. ఈ ప్రమాదాన్ని కార్మికులు నిరసనల ద్వారా తెలియజేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కొత్త యూనియన్ల రిజిస్ట్రేషన్‌లను 45 రోజుల్లో పూర్తి చేయాలన్న నిబంధనలను నిలుపుదల చేసేందుకు తమిళనాడులో కార్మికులు భారీ పోరాటం చేసి విజయం సాధించారని తెలిపారు. కార్మికులను ఈ కోడ్స్‌ను అడ్డుపెట్టుకొని హైయర్ అండ్ ఫైర్ పద్ధతులతో ఇష్టం వచ్చినట్లు తొలగించడం, ఫిక్స్ డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్‌తో నోటీసు ఇవ్వకుండా బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగించడం చేస్తారన్నారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల ప్రాణాలకే భద్రత లేకుండా పోవడంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ బోనస్ కనీస వేతనాలు వంటి ప్రాథమిక చట్టాల అమలు అధోగతి పాలయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు, నాయకులు బి.పవన్, ఎస్.ఎస్.మూర్తి, టి.ఎస్.ప్రకాష్, సావిత్రి, మురళి, బి.పూర్ణిమారాజు, కర్రి రామకృష్ణ, రవి, బేబీరాణి, రాంబాబు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు ఎఐటియుసి శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.లావణ్య, ఇఫ్టు సంఘం ప్రధాన కార్యదర్శి సప్పా రమణ, వ్యవసాయ కార్మిక సంఘం టి.నాగేశ్వరరావు, ఎఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, ఐఎఫ్‌టియు నాయకులు ఎస్.దుర్గారావు, కోసూరి అప్పలరాజు ఐఎఫ్‌టియు నగర సహాయ కార్యదర్శి, వనుం సుబ్రహ్మణ్యం, లక్ష్మణరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూరల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కె.సావరం అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది నిర్వహిస్తున్న పోషణ వాటిక మొక్కల పెంపకంలో భాగంగా పెంచిన ఆకుకూరలను గ్రామంలోని గర్భవతులు, బాలింతలకు బుధవారం పంపిణీ చేశారు. ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రసాద్ మాట్లాడుతూ ఎరువులు వాడకుండా, సేంద్రియ పద్ధతిలో సొంతంగా పండిస్తున్న ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు జి.పద్మవాణి, కెవివి.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి బుల్లి వెంకమ్మ, ఆరోగ్య కార్యకర్త వై.రత్నకుమారి పాల్గొన్నారు.



ఆకుకూరలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

6 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కడియం

దుళ్లలో భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు తెలిపారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చిక్కాలలో పోషక వాటిక

ప్రజాశక్తి-చాగల్లు

చిక్కాల కోడ్ నంబర్-4 అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ వాటిక కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భవతులకు ఆకు కూరలు పంపిణీ చేసి ప్రతి ఇంటిలోపల ఆకు కూరలు కాయగూరలు చెట్లు పెంచుకుని క్రిమి సంహారక విషపూరిత ఎరువులు వాడకుండా ప్రకతి సేద్యం చేసుకుంటే అనారోగ్యాల బారిన పడకుండా శరీరాన్ని కాపాడుకోవచ్చని ప్రాజెక్టు అధికారి డి.మమ్మీ తెలిపారు. గ్రామ సర్పంచ్ కొయ్య మణి పాల్గొన్నారు. ఎన్.సత్యవాణి, డి.శాంతకుమారి, ఎంవిస్. మహాలక్ష్మి, వి.గంగారత్నం, కె.దయమణి పాల్గొన్నారు

సంస్థాగత నిర్మాణంతో వైసిపి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సంస్థాగత పటిష్టతతో ప్రజాపక్ష పోరాటాలతో వైసిపి ప్రజలకు మరింత చేరువ అవుతోందని, కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని వైసిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక దివాన్ చెరువు విజయభారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్ వద్ద ఆయనను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, సోషల్ మీడియా వింగ్ జిల్లా అధ్యక్షుడు వల్లభశెట్టి వెంకట సత్యనారాయణ, అడబాల వీర సత్యనారాయణ, డాక్టర్ గూడూరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసిలు వాసంశెట్టి పెద్ద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, సర్పంచులు మరుకుర్తి వెంకటేశ్వరరావు, అరవాలు, కల్యాణం రాంబాబు, వేమగిరి కృష్ణ, బుజ్జి, రమణ, నేలపాల శివరామకృష్ణ, ఎంపిటిసి వీరపండు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షా తేదీల విడుదల

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఇంటర్, 10వ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి సమావేశం నిర్వహించారు. ఇంటర్, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టే చర్యలను అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు, ప్రశ్న పత్రాలను, జవాబుపత్రాలను భద్రపరిచిన సెంట్రల్ స్ట్రాంగ్ రూమ్ నుంచి ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించే క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని, నిర్దిష్టమైన రూట్ మ్యాప్‌ను అనుసరించి ముందస్తుగా పరీక్ష కేంద్రాలకు తరలించడం, పరీక్ష పూర్తయిన తర్వాత పోస్టల్ శాఖ ద్వారా పంపే ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలోకి విద్యార్థులను గంట ముందుగానే అనుమతిస్తామరని,ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని తెలిపారు. కావున విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, 10వ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ ంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జెరాక్స్ సెంటర్ మూసి ఉంచడం, ఇద్దరు ఎన్ఎంలతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయలని వైద్య అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సంఖ్య ఆధారంగా పోలీసు భద్రత, ఫ్రిస్కింగ్ కోసం మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు, తరువాత రెండు గంటల పాటు నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమేరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు సానిటేషన్, డ్రింకింగ్ వాటర్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా పంపిణీ చెయ్యడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రశ్న జవాబు పత్రాలు రవాణా చేసేందుకు అవసరమైన క్లోస్డ్ వాహనాలు, ఇతర వాహనాలు అందుబాటులో ఉంచాలని, ఇంటర్మీడియట్ అధికారులు, జిల్లా పాఠశాల విద్యా అధికారి ముందస్తుగా ఇండెంట్ పంపాల్సి ఉందన్నారు. ఇంటర్ పరీక్షల కోసం 51 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 20,591 మంది, రెండో సంవత్సరం 19,062, ఒకేషనల్ మొదటి సంవత్సరం 2,226 మంది, రెండో సంవత్సరం 1,875 మంది హాజరు కానున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎన్ఎస్‌విఎల్.నరసింహం తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం ఆర్ఐఒ కార్యాలయంలో పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు కంట్రోల్ రూమ్ నంబర్ 0883-2473430 అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్షల నిర్వహణ కమిటీ, హైపవర్ కమిటీ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 24,763 మంది, ప్రవేటు విద్యార్థులు 960 మంది 134 పరీక్ష కేంద్రాల్లో హాజరు కానున్నట్టు డిఇఒ కె.వాసుదేవరావు తెలిపారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి మురళీకృష్ణ, డిఆర్‌ఒ టి.సీతారామ్మూర్తి, కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, జిల్లా ఒకేషనల్ అధికారి జివిఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, డిటిఒ ఆర్.సురేష్, డిటిపిఒ షర్మిలా అశోక్, డిఎంహెచ్‌ఒ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వైఎస్.జగన్ పాలనలో తీవ్ర నష్టం

ప్రజాశక్తి -దేవరపల్లి

రాష్ట్ర విభజన కంటే జగన్ మోహన్ రెడ్డి పాలన వల్లే రాష్ట్రం ఎక్కువ నష్టం పోయిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్ హాల్లో మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ కన్వీనర్ల సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. గత ప్రభుత్వంలో కక్షలు, వేధింపులే ధ్యేయంగా పాలన చేశారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో రాష్ట్రాభివద్ధి అట్టడుగు స్థాయికి దిగజారిపోయిందన్నారు. పరిశ్రమలు తరలి వెళ్లిపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. ప్రస్తుతం జరిగే పట్టభద్రుల ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకమని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు కూటమి ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, దేవరపల్లి టిడిపి అధ్యక్షుడు ఆండ్రు అనిల్, కాట్నం గణేష్ పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మళ్లీ వడ్డీ లేని రుణాలు మంజూరు కానున్నాయని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పేర్కొన్నారు. స్థానిక 25వ డివిజన్‌లో సుమారు 250 మంది మహిళలు వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, ఛాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, నగర టిడిపి ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి తదితరులు వారందరికీ పార్టీ కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం మొదలయ్యిందన్నారు. గత పాలకులు మహిళల ఆర్థికాభివద్ధికి తూట్లు పొడిచారగత ఐదేళ్లు తాము ప్రతిపక్షంలో ఉన్నా కానీ 25వ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, గత పాలకుల వల్ల కొన్ని పనులు సక్రమంగా చేయలేకపోయామన్నారు. ప్రజా ప్రతినిధులమని చెప్పుకునే కొందరు తమకు అడ్డు పడ్డారని గుర్తు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను అర్హులకు ఇవ్వకుండా వైకాపా ప్రభుత్వం శిథిల స్థితికి చేర్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

531 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 99 గుంతలు లేని రహదారుల పనులకు చెందిన 531.60 కిలోమీటర్ల మేర పనులను రూ.22 కోట్ల 65 లక్షల 90 వేలతో చేపట్టినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం మండల పరిధిలో ప్రతిపాదించిన 99 పనులకు సంబంధించి 530.060 కిలోమీటర్ల రూ.21 కోట్ల 11 లక్షల పనులు పురోగతిలో ఉన్నాయని, వాటిలో ఇప్పటి వరకు రూ.10 కోట్ల 57 లక్షల చేపట్టిన 55 పనులు పూర్తి చేశామని తెలిపారు. ఫిబ్రవరి 15 వ తేదీ నాటికి నూరుశాతం పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు.

నియోజకవర్గాల వారీగా ప్రగతి

రాజానగరం నియోజకవర్గంలో 138.41 కిలోమీటర్ల పనులను రూ.5 కోట్ల 57 లక్షలతో మంజూరు చేయగా 83.31 కిలోమీటర్ల పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో 119.246 కిలోమీటర్ల పనులను రూ.5 కోట్ల 88 లక్షలతో మంజూరు చేయగా 97.330 కిలోమీటర్ల పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. అనపర్తి నియోజకవర్గంలో 82.592 కిలోమీటర్ల పనులను రూ.3 కోట్ల 39 లక్షలతో మంజూరు చేయగా 71.972 కిలోమీటర్ల పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో 4.695 కిలోమీటర్ల పనులను రూ.29 లక్షలతో మంజూరు చేయగా నూరుశాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలంలో 13.400 కిలో మీటర్ల పనులను రూ.74 లక్షలతో మంజూరు చేయగా 4 కిలోమీటర్ల పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలో 37.961 కిలో మీటర్ల పనులను రూ.కోటీ 7 లక్షలతో మంజూరు చేయగా 26.721 కి మీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలో 51.598 కిలో మీటర్ల పనులను రూ.2 కోట్ల 94 లక్షలతో మంజూరు చేయగా 40.048 కి మీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలో 82.158 కిలోమీటర్ల పనులను రూ.2 కోట్ల 17 లక్షలతో మంజూరు చేయగా 45.400 కి మీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

నన్నయలో ఘనంగా గిరిజన ఉత్సవాలు

ప్రజాశక్తి-రాజానగరం

తెలుగు జాతి సంస్కృతీ వైభవాన్ని ఆదివాసీలు కాపాడుతున్నారని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం నన్నయ విశ్వవిద్యాలయ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కతిక మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, విసి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ విశ్వవిద్యాలయ అధికారులు, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కతిక మహోత్సవాలను ప్రారంభించారు. ముందుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన గిరిజన ఆదివాసీల కళాకారులు సాంప్రదాయ నత్య ప్రదర్శనలతో విశ్వవిద్యాలయ చాళుక్య ద్వారం నుండి ఆడిటోరియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ గిరిజనులకు అందించిన సేవలను గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాయని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ పొందాలన్నారు. కళలను, సంస్కతిని గిరిజనులు పరిరక్షిస్తున్నారని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల నుంచి నూతన జాతీయ రహదారులు వేస్తున్నారని చెప్పారు. తెలుగు భాషా, సంస్కతి, సాహిత్యాన్ని పరిరక్షించడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. చక్కని కార్యక్రమం నిర్వహించిన నిర్వహకులను అభినందించారు. విసి ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గిరిజన ప్రాంత్రాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఆవిర్భవించిందని అన్నారు. మహనీయులు ఆలోచనలను, ఆశయాలను సాకారం చేసే విధంగా గిరిజనులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయం చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ వారిని అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంతో అద్భుతమైన ప్రాచీన గిరిజన నృత్య ప్రదర్శనలు నిర్వహించామని అన్నారు. డాక్టర్ పి.విజయనిర్మల మాట్లాడుతూ ఐసిఎస్ఎస్ఆర్ సహకారంతో స్థిరమైన పర్యావరణం కోసం గిరిజన సంస్కతి పాత్ర అనే అంశంపై ప్రాజెక్టు నిర్వహిస్తున్నామన్నారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్ మాట్లాడారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర సంస్కతిని కాపాడుకోవాలన్నారు. టిఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లి భాస్కర్, మాజీ టిఎస్ఎఫ్ నాయకుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ దొర మాట్లాడుతూ దేశంలో ఆదివాసులు తమదైన ప్రత్యేక హస్తకళా నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని, అందుకే వారి సహజసిద్ధ నైపుణ్యాలను ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులను ప్రచారం చేయడం, వారి ఆదాయ వనరులను మెరుగు పరచడం ఎంతో ముఖ్యమని చెప్పారు. గిరిజనుల వివిధ ఉత్పత్తులు, హస్తకళల సహజసిద్ధ నైపుణ్యాలకు వ్యాపార విలువలను జోడించుకోవాలని సూచించారు. ఈ-కామర్స్, డిజిటల్ వ్యాపార మార్గాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.




నన్నయ వర్శిటీలో ఆకట్టుకున్న గిరిజనుల నృత్యాలు

8,200 హెక్టార్లలో వరి సాగు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో 8200 హెక్టార్ల దాళ్వా వరి సాగుతోందని మండల వ్యవసాయ శాఖ అధికారి కోయిలమూడి గోపాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం వరి పిలక దశలో ఉందని, ఇప్పుడు కాండం తొలుచు పురుగు ఆశించుతుంది కావున రైతులు ఎకరానికి కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4జి గుళికలు 8 కేజీలు వేసుకోవాలని సూచించారు. దుబ్బు చావు గుర్తించి వాలిడామైసిన్ సల్ఫేట్ 500 మిల్లీలీటర్లు ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని ఆయన తెలిపారు.

కార్టూ'నిజం'



భయపెడుతున్న ఇసుక లారీలు

- మితిమీరిన వేగంతో ప్రజల బెంబేలు
- ప్రధాన రహదారిపై పేరుకున్న ఇసుక
- వాహనచోదకుల ఇబ్బందులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ధవళేశ్వరం గ్రామం ఇసుక లారీల జోరుతో హోరెత్తిపోతోంది. రాత్రిపగలు తేడా లేకుండా ఇసుక లారీల రాకపోకలతో గ్రామంలో ప్రధాన రహదారి రద్దీగా మారిపోయింది. భారీ లారీర రాకపోకలతో రహదారి చిద్రమవుతోంది. ఇష్టానుసారంగా మోతాదుకు మించి ఇసుకను తరలిస్తుండటంతో లారీల నుంచి రోడ్డుపైకి ఇసుక జారిపడిపోతోంది. ఇలా వందలాది బస్తాల ఇసుక ఇంకా ప్రధన రహదారిపైనే ఉంది. దీంతో బైకుపై వెళ్లేవారు ఇసుకలో జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. దీంతో రోడ్డుపైకి వెళ్లాలంటేనే గ్రామస్తులు భయపడిపోతున్నారు. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలోని గాయత్రి ఇసుక ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడ నుంచి నిత్యం వందలాది లారీలు ఇసుకను వేమగిరి వైపునకు, రాజమహేంద్రవరం వైపునకు తరలిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో రహదారులన్నీ పూర్తిగా ఛిద్రమయ్యాయి. కొయర్ బోర్డు సమీపం నుంచి ఐఒసి వరకూ, అలాగే ఇటుగా ఎఫ్‌సిఐ వరకూ రోడ్ల మార్జిన్‌లో ఇసుక పేరుకుపోయింది. ధవళేశ్వరం గ్రామాంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కాటన్‌బ్యారేజీ సెంటర్‌లో వేమగివైపునకు వెళ్లే మలుపుతో పెద్దఎత్తున ఇసుక రోడ్డు మార్జిన్‌ను దాటి కప్పేసింది. కోనసీమ, పశ్చిమ గోదావరి వైపు నుంచి ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా వేమగిరి వైపునకు వేళ్లేవారు తప్పని సరిగా ఈ మలుపును దాటాల్సి ఉంటుంది. ఇక్కడ నిత్యం వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఇదే ప్రాంతంలో మరో లింకు రోడ్డు గుండా ఇరిగేషన్ కార్యాలయాలకు నిత్యం ఉద్యోగులు, కార్యాలయాన్ని ఆనుకని ఉన్న లాకులైన్సు కాలనీ వాసులు ఈ మార్గం గుండానే ప్రయాణించాల్సి ఉంది. ప్రతి రోజూ స్కూలు వాహనాలు సైతం ఇటుగానే తిరుగుతుంటాయి. ఇసుక కారణంగా వాహనచోదకులు ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. బైకులు స్కిడ్ అవుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇసుక లారీలు వెళ్లిన సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము సైతం రేగడంతో స్థానిక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధవళేశ్వరంలోని ప్రధాన రహదారిపై పేరుకుపోయిన ఇసుక

భారీ ఇసుక లారీలతో బెంబేలు...

భారీ ఇసుక లారీ రాకపోకలతో ప్రజలు, విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. ధవళేశ్వరం ప్రధాన రహదారిని ఆనుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికోన్నత పాఠశాల, ఎయిడెడ్ పాఠశాల, ప్రయివేటు పాఠశాలలు, ఐటిఐలు ఉన్నాయి. ప్రతిరోజూ విద్యార్థులు ఈ రహదారి గుండానే ప్రయాణిస్తున్నారు. అసలే రహదారి ఇరుకుగా ఉండటం, దీనికి తోడు భారీ ఇసుక లారీలు రాకపోకలతో వారు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంస్థల పనివేళల్లో సైతం లారీలు అడ్డూఅదుపూ లేకుండా ప్రయాణించ డంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాలు పగటి వేళల్లో గ్రామాల్లో నుంచి ప్రయాణించరాదనే నిబంధన ఉన్నా ఇక్కడ అమలు కావట్లేదు. కనీసం పోలీసులు సైతం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డుపై ఇసుకను తొలగించాలి

ఇసుక లారీల కారణంగా ప్రధాన రహదారి అంతా ఇసుకతో నిండిపోయింది. బైకులు అదుపుతప్పుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. బైకుపై పిల్లలను పాఠశాల వద్దకు దింపాలన్నా భయం వేస్తుంది. పంచాయతీ సిబ్బంది అయినా స్పందించి రోడ్డుపై ఇసుకను తొలగించాలి. భారీ ఇసుక లారీలు రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా కలుగుతున్నాయి.

- వి.శ్రీనివాస్, బ్యారేజీ కాలనీ, ధవళేశ్వరం



ఇసుక లారీల రాకపోకలు నిలిపేయాలి

గ్రామంలో నుంచి ఇసుక లారీల రాకపోకలను నిలిపేయాలి. మితిమీరిన వేగంతో వెళ్తున్నాయి.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తుంది. పిల్లలను స్కూళ్లకు పంపాలన్నా భయంగా ఉంది. ఇసుక లారీలను గ్రామం నుంచి కాకుండా ఐఎల్‌టిడి నుంచి హైవే మీదుగా మళ్లించాలి.

- జె.జాన్సన్, ధవళేశ్వరం

నేరాలు ఘోరాలు

భర్త చెంతకు భార్య, పిల్లలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోటకి చెందిన ఒక కుటుంబంలో భార్య భర్తల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదంతో భార్య నలుగురు పిల్లలను తీసుకుని బయటికి వెళ్లిపోయింది. జనవరి 28న జరిగిన ఈ సంఘటనపై భర్త స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు గుర్తించి బుధవారం వారిని భర్తకు అప్పగించారు. ఈ సందర్భంగా చిన్నపాటి వివాదంతో భార్య తన నలుగురు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోగా భర్త ఇచ్చిన ఫిర్యాదుపై వారి ఆచూకీ కోసం ప్రయత్నించినట్లు సిఐ ఎ.కృష్ణ భగవాన్ చెప్పారు. అయితే భార్య పిల్లలు హైదరాబాదులో ఉండడాన్ని తమ సిబ్బంది గమనించి వారిని వెంటబెట్టుకుని రాగా భార్యాభర్తలు ఇరువురికి కౌన్సిలింగ్ నిర్వహించి భర్తకు భార్య పిల్లలను అప్పగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి - కాజులూరు

అగ్ని ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాజులూరు శ్రీరామ్‌నగర్ కాలనీలో కొత్తూరు రాజేశ్వరి (70) తాటాకు ఇంట్లో నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ నిలిచిపోవడంతో అగ్గి పెట్టితో దీపం వెలిగించే క్రమంలో ఆమె చీరకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఆమె 80 శాతం కాలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో బుధవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మర్లావ గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటరు ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. అలాగే కాకినాడ ఎసిఇఎన్‌ఎఫ్‌టి బృందం మురారి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 11 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ, ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-చాగల్లు

కొవ్వూరు పట్టణానికి చెందిన ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. కొవ్వూరుకు చెందిన కర్ర అవినాష్ కుమార్ ఈ నెల1న స్నేహితులతో కలిసి చాగల్లు వెళ్లారు. తిరిగి వస్తుండగా అర్ధరాత్రి చాగల్లులెపి వెంకటకృష్ణ థియేటర్ రోడ్డులో చాగల్లుకు చెందిన కోతాడ నాగ శివ సాయి కుమార్, తొర్లపాటి దుర్గాప్రసాద్ కలిసి అవినాష్ కుమార్‌పై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. బాధితుని ఫిర్యాదుపై సాయికుమార్, దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి బుధవారం నిడదవోలు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని నెలటూరుకు చెందిన వివాహిత ఆలపాటి రామలక్ష్మి రెండు రోజుల క్రితం ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇంటి నుండి వెళ్లిపోయినట్టు ఆమె భర్త ఆలపాటి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మహిళ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చోరీ, దాడి కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-కడియం

దొంగతనం చేసి పారిపోతూ, అడ్డుకున్న వ్యక్తిని కత్తితో పొడిచిన కేసులో ముద్దాయికి జడ్జి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. 2020లో కడియపులంకలో ఒక ఇంట్లో దొంగతనం చేసి పారిపోతూ అడ్డొచ్చిన వ్యక్తిని పొడిచినట్టు వచ్చిన ఫిర్యాదుపై అప్పటి మహిళా ఎస్ఐ షేక్ అమీనా బేగం కేసు నమోదు చేశారు. ముద్దాయి నేతల రాజేష్‌ను అరెస్టు చేశారు. నేరం రుజువడంతో జడ్జి ఒక సంవత్సరం జైలుశిక్ష విధించినట్లు సిఐ తెలిపారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎ గొల్లపల్లి

ప్రజాశక్తి - యానాం

యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్‌ను పుదుచ్చేరిలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా యానాంకు సంబంధించిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు అలాగే చేపట్టవలసిన అభివృద్ధి పనులు, పథకాలు అమలు తదితర అంశాలపై లెఫ్టినెట్ గవర్నర్‌తో చర్చించారు. వినతి పత్రాన్ని అందించారు. పుదుచ్చేరి ఎంఎల్ఎ శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లితో పాటు జాన్ కుమార్, కళ్యాణసుందరం, తదితరులు ఆయనను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు వెంకట్రావు మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం



వెంకట్రావు (ఫైల్)

స్థానిక గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కోరం వెంకట్రావు(61) గుండెపోటుతో బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా సుదీర్ఘ కాలం పాటు కపిలేశ్వరపురం గ్రామంలో సేవలందించారు. వెంకట్రావు మరణం బాధాకరమని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, కార్యదర్శి కె.శివ చక్రవర్తి, పాలకవర్గ సభ్యులు అన్నారు. వెంకట్రావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

గీత కార్మికుల మద్యం షాపుల దరఖాస్తుల గడువు మూడు రోజులు పెంపు

ప్రజాశక్తి - అమలాపురం

గీత కార్మికులకు జిల్లాలో 13 షాపులను కేటాయిస్తూ ఈనెల 5వ తేదీ వరకు ఉన్న అప్లికేషన్ గడువు మరో మూడు రోజుల పాటు పొడిగించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఐదో తేదీ నాటికి గడుముసినప్పటికీ ఈ నెల 8వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఆయన చెప్పారు. పదో తేదీన మద్యం షాప్ టెండర్లను కలెక్టరేట్ లోని గోదావరి భవన్ లో తెరుస్తామన్నారు. ఈనెల 8న బ్యాంకులకు సెలవు ఉన్నందున ఏడో తేదీ నాటికే ధరావతు సొమ్ము డిడిలు సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 13 షాపులకుగాను 42 దరఖాస్తులు వచ్చాయనాట్నరు. మూడు షాపులకు అసలు దరఖాస్తులు రాలేదని ఆయన చెప్పారు. రామచంద్రపురం, కొత్తపేట, ఐపోలవరం మండల షాపులకు దరఖాస్తులు రాలేదన్నారు. **ఆలమూరు:** గీత కార్మికుల కోసం ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ గడువు ఈనెల 8న సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఈనెల 5 వరకు టెండర్లకు గడువు ఇచ్చారన్నారు. మరలా దానిని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారులు ఎవరైనా తమ వివరాలతో కార్యాలయంలో సంప్రదించుకొని, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే ఈనెల 9న అందిన టెండర్లన్నింటిని పరిశీలించి, అర్హులను గుర్తించి జాబితా తయారు చేసి, 10న ఉదయం 9 గంటలకు వారందరికీకలెక్టర్ కార్యాలయంలో డ్రా తీసి, విజేతలను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

చొప్పెల్లలో మాంసం విక్రయాల తనిఖీ

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి, రెవెన్యూ సిబ్బంది సహాయంతో మాంసం, చేపల దుకాణాలను, నిల్వలు వాటి విక్రయాల స్థితి గతులను బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురు మాంసం విక్రేతలు నిల్వ ఉంచిన మాంసాలను అమ్ముతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిల్వ కలిగిన మాంసం మొత్తాన్ని పంచాయతీ డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ మంటల్లో వేశామన్నారు. అలాగే గ్రామ పరిధిలో మాంసం, చేపలు, రొయ్యలు వంటి మాంసాహారాలు అమ్మే వారు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆరోగ్య సమస్యలపై మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఇలా నిల్వ ఉన్న మాంసాహారం తినడం వల్ల అనారోగ్యం పాలవుతారని మాంసాహారాలు కొనేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఇటువంటి తప్పుడు విధానంలో నడిచే వారు తారసపడితే వెంటనే పంచాయతీ అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ

మండపేట : పట్టణం, మండపేట మండలంలలో ఇటీవల పలువురు మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. పట్టణానికి చెందిన పిల్లి మేరి, అడపా రాజమ్మ కుటుంబ సభ్యులను, అర్తమూరు లో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఏడిద కొత్తూరులో పలివెల బాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శలలో ఎంఎల్ఎ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పెందుర్తి ప్రదీప్, చాపల వీరబాబు, ముమ్మిడివరపు నారాయణ, ధూళి జయరాజు, మోరంపూడి సూరిబాబు, కందుకూరి గంగరాజు, ధూళి ప్రవీణ్, పిల్లా గణపతి తదితర్లు పాల్గొన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి బాధాకరం

అయినవిల్లి : మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడి బాధాకరమని పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులను, కార్యకర్తలను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపించాలన్నారు. ఇళ్ళపైకి వెళ్లి దాడులు చేయడం మానుకోవాలన్నారు.

విద్యార్థి తనుష్ తేజకు అభినందన

ఉప్పలగుప్తం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన పెరేడ్ లో గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మదిరి తనూష్ తేజ పాల్గొన్నాడు. పెరేడ్ లో ఆంధ్రప్రదేశ్ శకటం ఏటి కొప్పాక బొమ్మలతో ముస్తాబైన శకట నృత్య ప్రదర్శనలో రాష్ట్ర కళా సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే ప్రధాన నత్య తారాగణంలో తనుష్ తేజ పాల్గొని పలువురి పెద్దల అభినందనలు అందుకున్నాడు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తనుష్ తేజకు బుధవారం తాను చదువుతున్న గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తనుష్ తేజకు హెచ్‌ఎం ఎల్.రాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.

మెప్మా రిసోర్స్ పర్సన్ రామలక్ష్మి ఆకస్మిక మృతి

ముమ్మిడివరం : మెప్మా రిసోర్స్ పని చేస్తున్న మాదేటి రామలక్ష్మి (47) బుధవారం గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందింది. నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంకు చెందిన రామలక్ష్మి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా లో రిసోర్స్ పర్సన్‌గా సేవలు అందిస్తూ, మంచి వర్కర్ గా అందరికీ సుపరిచితురాలు. బుధవారం ఉదయం రోజువారి కార్యక్రమాలను చేసుకుంటూ ఆమె తీవ్ర గుండెపోటుకు గురై ఆకస్మాత్తుగా మృతి చెందింది. మృతురాలికి భర్త ధర్మరాజుతో పాటు వివాహమైన కుమార్తె, బిటెక్ చదివిన కుమారుడు ఉన్నారు. కుటుంబం రామలక్ష్మిపైనే ఆధారపడి జీవనం సాగిస్తోంది. ఆర్‌పి మృతికి మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు సంతాపం తెలిపారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు

కపిలేశ్వరపురం : టేకి జడ్‌పి ఉన్నత పాఠశాలలో బుధవారం కిశోర బాలికల వికాసంపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.గజలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికల వ్యక్తిత్వ వికాసం వద్ధి చెందేలా అందరూ కషి చేయాలని అన్నారు. నాణ్యమైన విద్య, వ్యక్తిగత ఆరోగ్యం, రక్త హీనత, మహిళా అక్రమ రవాణా, లింగ వివక్షత, బాల్య వివాహాలు నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను కిశోర బాలికలకు వివరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక లయన్స్ క్లబ్‌లో లయన్స్ వెదులపల్లి సత్యనారాయణమూర్తి ఉచిత కంటి ఆసుపత్రి నందు బుధవారం అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవణం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 10 మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికీ ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని కిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. నలుగురికీ కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఐ ట్రస్ట్ కోశాధికారి లయన్ జంపన సుమన్ వర్మ, లయన్స్ క్లబ్ బిల్డింగ్ చైర్మన్ లయన్ సుగ్గు గోపి, లయన్ సుధా గణపతి, లయన్ శిష్టా శ్రీహరి లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాలాజీ స్వాగత ద్వారం లైటింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి - మామిడికుదురు

అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవాల సందర్భంగా 216వ జాతీయ రహదారి నానుకుని పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్లో శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయ స్వాగత ద్వారం పై ఏర్పాటుచేసిన లైటింగ్ యాత్రికులను ఆకట్టుకుంది. అంతర్వేది కళ్యాణోత్సవాల సందర్భంగా యాత్రికులకు స్వాగతం పలుకుతూ లైటింగ్ ఏర్పాటు చేశామని ఆలయ సహాయ కమిసనర్ ఎం. సత్యనారాయణ రాజు తెలిపారు.

గుండెపోటుకు సత్వర వైద్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గుండె పోటుకు గురైన వారికి సకాలంలో సత్వర వైద్యం అందించడం ద్వారా రోగి ప్రాణాన్ని నిలబెట్టవచ్చునని ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్య నిపుణులు డా.పెంకె పథ్వీ (ఎండి. జనరల్ మెడిసిన్) అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి నందు బుధవారం సూపరిటెండెంట్ వైద్యురాలు సాయిశ్రుతి అధ్యక్షతన గుండె పోటు చికిత్సపై విలేకరుల నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు పథ్వి మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారికి స్థానికంగా సామాజిక ఆరోగ్య కేంద్రం ముమ్మిడివరం నందు అత్యవసర వైద్యం అందించెందుకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గుండెనొప్పి రోగులకు తక్షణమే స్వాంతన చేకూరలా హబ్ అండ్ స్పోక్ విధానంలో సుమారు రూ.40,000 ఖరీదు చేసే ఇంజక్షన్ ను అవసరమైన రోగులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. గుండె నొప్పి సమస్యతో వచ్చేవారికి వైద్యులు, వెంటనే ఇసిజి చేసి రోగులు వివరాలు నమోదు చేసి సమస్యను కాకినాడ జనరల్ ఆసుపత్రికి పంపుతామన్నారు.

విఆర్‌ఒల గ్రేడ్‌లు తొలగించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

విఆర్‌ఒలు అందరికీ గ్రేడ్‌లు తొలగించి తహశీల్దార్‌ను డిడిఒగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మండల కమిటీ బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం పంపించారు. గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రామపంచాయతీ కార్యదర్శులు, డిడిఒగా ఉండాల్సిన ప్రభుత్వం నిర్దేశించిన పనుల విషయంలో విఆర్‌ఒలు, కార్యదర్శులకు చాలా చోట్ల వివాదాలు జరుగుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని వినతిపత్రంలో కోరారు. సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరీలుగా విభజించుట అభినందనీయమన్నారు. ఈ విషయమై చీఫ్ కమిషన్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ వెలగపూడి, జిల్లా కలెక్టర్, కొత్తపేట ఆర్‌డిఒ, అంబాజీపేట తహశీల్దార్ జె.వెంకటేశ్వరీలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో మండల శాఖ అధ్యక్షులు గిడ్డి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి జి.నాగలక్ష్మి, గౌరవ అధ్యక్షులు వి.రామకష్ణ, మండల రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, గంజాయి వినియోగం పైన ప్రత్యేక దృష్టి సాధించామని ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్వేదిలో జరుగుతున్న ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గోదావరి జిల్లాల్లో తో పాటు పలు ప్రాంతాల్లో గంజాయి వాడకం పెరిగిందన్నారు. దీంతో పాటుగా ఇటీవల క్రైమ్ రేటు అధికంగా ఉంటోందని దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు

13న మెగా సాఫ్ట్‌వేర్ జాబ్ మేళా

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఈనెల 13 న ప్రముఖ ఐటీ సంస్థలలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఈ నెల 13న మెగా సాఫ్ట్ వేర్ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. ఈ మేరకు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం , ప్రిన్సిపల్ కె.బాలాజీలు విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ అర్హులైనవారు జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని సత్యం విజ్ఞప్తి చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టికి చర్యలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

తడి, పొడి చెత్త నుంచి సంపదను సృష్టించడానికి కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణసత్యరెడ్డి సూచించారు. బుధవారం ఎండపల్లి, శ్రీరామపురం, రమణక్కపేట గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యం అమలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరుగున పడిన చెత్త కేంద్రాన్ని వినియోగం తీసుకొస్తే సంపదను సృష్టించవచ్చని తెలిపారు. మండలంలో ఉన్న చెత్త సంపద కేంద్రాల్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను ముమ్మరం చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో రానున్న 45 రోజుల పాటు అధిక సంఖ్యలో కూలీల హాజరుతో ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డ్వామా, పంచాయితీరాజ్, మండల పరిషత్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్లు, గోకులం పశువుల షెడ్లు తదితర పనులన్నింటినీ మార్చి మాసాంతానికి పూర్తి చేయాలని ఆదేశించారు. పారంభం కాని పనులన్నిం టిని వెంటనే మొదలు పెట్టాలని అన్నారు. గ్రౌండ్ చేసిన పనుల వివరాలు, వాటికి ఎఫ్‌టిఒల జనరేషన్, బిల్స్ అన్‌లైన్ అప్ లోడింగ్ ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని ఆదేశించారు. మంజూరు చేసిన ప్రతి పని తప్పనిసరిగా పూర్తి కావాలని, మంజూరు చేసిన ఒక్క రూపాయి కూడా వృధా కారాదన్నారు. నిర్ధేశించుకున్న పనిదినాల లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధి పనులకు హాజరౌతున్న కూలీల సంఖ్యను రానున్న 45 రోజుల పాటు మరింత పెంచాలని సూచించారు. ఈ వారం కూలీల హజరు శాతం ఏలేశ్వరం మండలంలో బాగుందని కలెక్టర్ ప్రసంశించి, ఉపాధి పనుల అవసరం, అవకాశం ఎక్కువగా ఉన్న కోటనందూరు మండలంలో ఆశించిన స్థాయిలో లేక పోవడం పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ, సేవ కార్యక్రమాల నిర్వహణలో గడచిన 30 ఏళ్లుగా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్న ఆదర్శనీయ ఒరవడిని కాకినాడ జిల్లా కొనసాగించేలా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. సమాజ హితం, ఆపన్నుల సహాయం కోసం చేసే ప్రతి కృషి అనిర్వచనీయమైన సంతోషాన్ని, తృప్తిని అందిస్తుందన్నారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ పెద్ద స్థాయిలో చేపట్టాలని ఆయనకోరారు.

శివరాత్రి ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టండి

ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు, రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సందర్శకుల కొరకు రవాణా, తాగునీరు, సురక్షిత స్నాన ఘట్టాలు, దుస్తుల మార్చుకునేందుకు చేంజింగ్ రూంలు, మరుగుదొడ్లు, బారికేడింగ్, లైటింగ్, సూచనలు ఇచ్చేందుకు, తప్పిపోయిన వారి జాడ్ తెలిపేందుకు మైక్ సిస్టమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ఇంటర్మీడియట్ ప్రీ ఫైనల్ పరీక్షల ఉత్తీర్ణశాతం వివరాలు, మార్చి ఒకటి నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నాయని, ఈ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల విద్యా బోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా రానున్న 25 రోజులు జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డిఐఇఒ జిజికె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

వంతుల వారి విధానంలో సరఫరా చేస్తున్న సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటిపల్లి సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు దాట్ల విజయ గోపాలరాజు కోరారు. బుధవారం మండలంలోని కోలంక గ్రామంలో ఆయన మాట్లాడారు. సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం రైతులు, కౌలు రైతులు వినియోగార్థం వరి పంటకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా వంతులు వారి విధానాన్ని ప్రవేశపెట్టిం దన్నారు. ఈ విధానంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రెండు రోజులుగా మూడు రోజులుగాని ఒక వంతుగా క్రిందికి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి నెలకి సంబంధించి మసకపల్లి కింద సేద్యం చేసే రైతులు ఈ నెల 7 నుంచి 10 వరకు, 16 నుంచి 19, 25 నుంచి 28 వరకూ సాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, వారి సహాయకులకు అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.